సాక్షి మంచిర్యాల

బుధవారం ⋮ 8 ⋮ జనవరి ⋮ 2025



మళ్లీ కలప దందా

మళ్లీ కలప దందా మొదలైంది. స్మగ్లర్లు దట్టమైన అటవీ ప్రాంతంలోని టేకుచెట్లను నరుకుతున్నారు. వాటిని సైజులుగా మార్చి రాత్రివేళ అక్రమంగా రవాణా చేస్తున్నారు. 8లో▸

దారి తప్పుతున్న ధాన్యం

కొనుగోలు కేంద్రాల నుంచి రైతుల ధాన్యం మిల్లుల కు తరలించే క్రమంలో ధ్రువపత్రాలు తప్పనిసరి. ఈక్రమంలో దళారులు సర్టిఫికెట్లపై అధికారుల సంతకం ఫోర్జరీ చేస్తున్నట్లు తెలుస్తోంది.



9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.0 /13.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. గాలిలో తేమశాతం ఎక్కువవుతుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రైతుల ఖాతాల్లో రూ.131.24 కోట్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వరి ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో రూ.131.24 కోట్లు జమ చేసినట్లు అదనపు కలెక్టర్ మోతీలాల్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 317కొనుగోలు కేంద్రాల ద్వారా 93, 852 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో 37,6142 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం సేకరించినట్లు తెలిపారు. జిల్లాలోని 26 రైస్ మిల్లులకు సీఎంఆర్ అనుమతులిచ్చినట్లు పేర్కొన్నారు.

ప్రశ్నపత్రాలు పకడ్బందీగా తయారు చేయాలి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: ఒకటి నుంచి పదోతరగతి వరకు చదివే విద్యార్థులకు నిర్వహించనున్న పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాల ను పకడ్బందీగా తయారు చేయాలని జిల్లా విద్యాధికారి యాదయ్య డీసీఈబీకి సూచించారు. మంగళవారం ఇల్లా సైన్స్ సెంటర్‌లో ఫిబ్రవరిలో నిర్వహించనున్న పదోతరగతి ప్రీఫైనల్, ఏప్రిల్‌లో నిర్వహించనున్న ఒకటి నుంచి తొమ్మిదో తరగతి ఎస్ఏ-2 ప్రశ్నపత్రాల తయారీకి కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాలను బ్లూప్రింట్ ప్రకారం చేయాలని, అకాడమీ స్టాండర్డ్స్ ప్రకారం వెయిటేజీ ఉండాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రాక్టీస్ కోసం జిల్లాలో ఒక ప్రీఫైనల్ పరీక్ష అదనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. త్వరలో రిటైర్డ్ కానున్న డీసీఈబీ సెక్రటరీ భీంరావు మాట్లాడుతూ.. ఇది చివరి వర్క్‌షాప్‌గా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ కుమారస్వామి, వివిధ సబ్జెక్టుల నిపుణులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికే రెడ్‌క్రాస్



వైద్యపరికరాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ప్రజాసంక్షేమానికి సేవలందిస్తున్నట్లు కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లోగల ఆనంద నిలయంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ డొనేషన్ క్యాంపర్ వాహనాన్ని ఐవోసీఎల్‌డీజీఎం కైలాస్‌కాంత్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా రెడ్‌క్రాస్ ద్వారా సేవలందించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని డయాలసిస్, తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, ప్రమాదంలో గాయపడ్డవారికి అత్యవసర సమయాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ నుంచి రక్తం ఇస్తున్నట్లు చెప్పారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఐవోసీఎల్‌డీజీఎం మాట్లాడుతూ.. మంచిర్యాలలోనే కాకుండా మరో ఐదు ప్రాంతాల్లో సీఎస్ఆర్ నిధుల నుంచి తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధి నిర్మూలన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐవోసీఎల్ రామగుండం ఇన్‌చార్జి ఆసిఫ్, రెడ్‌క్రాస్ కార్యదర్శి చందూరి మహేందర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు వీ మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రచార రథాలు ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న సంతోష్‌కుమార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సడక్ సురక్షా అభియాన్-2025లో భాగంగా జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రచారరథాలను డీటీవో కార్యాలయంలో మంగళవారం డీటీవో సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31వరకు రెండు ప్రచార రథాల ద్వారా జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో రోడ్డు భద్రతపై వాహనచోదకులు, ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎంవీఐలు రంజిత్, కిశోర్‌చంద్రారెడ్డి, ఏఎంవీఐలు ఖాసీంసాహెబ్, సూర్యతేజ తదితరులున్నారు.

కమలంలో సంస్థాగత సందడి!



- బూత్‌స్థాయి నుంచి జిల్లా అధ్యక్షుడి దాకా ఎన్నిక
- గ్రామ, మండల స్థాయిలలో పూర్తవుతున్న ఎంపిక
- జిల్లా అధ్యక్ష పదవి బీసీ, ఎస్సీలకు ఇవ్వాలనే డిమాండ్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'కమలం' పార్టీలో సంస్థాగత ఎన్నికల సందడి నెలకొంది. సంక్రాంతి లోపు నియామకాలు పూర్తి చేయాలని పార్టీ ఆదేశించింది. ఈ క్రమంలో వచ్చే శాసనసభ ఎన్నికల నాటికి సత్తా చాటడమే లక్ష్యంగా బూత్ స్థాయి నుంచి జిల్లాలో సంస్థాగత ఎన్నికల కోసం కసరత్తు నడుస్తోంది. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం నియామకాల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 18మండలాలు, ఏడు మున్సిపాలిటీల్లో తొలుత బూత్ లెవల్ కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పని చేసే వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తూ ఈ మేరకు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే బూత్ అధ్యక్షులు, గ్రామ, మండల స్థాయిలో పలు అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ నాయకులను ఎంపిక చేస్తున్నారు. దాదాపు సగం మండలాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. దీనిపై ప్రత్యేకంగా ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో అభిప్రాయాలు తీసుకున్నారు. అలాగే పార్టీ నుంచి ఎన్నికల ఇన్‌చార్జిగా బద్దం ఎల్లారెడ్డి వ్యవహరిస్తున్నారు.

యువతకు తొలి ప్రాధాన్యం

పార్టీలో యువతను ఆకట్టుకునేందుకు వారికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలనే కోణంలో 45ఏళ్లలోపు వారికే అవకాశం కల్పిస్తున్నారు. ఆ వయస్సు వారికే ముందుగా మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తున్నారు. అయితే కొందరి వయస్సు అటు.. ఇటుగా ఉన్న చోట్ల నియోజకవర్గ ఇన్‌చార్జీలు ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో మూడు నియోజకవర్గాల బాధ్యులు మండల స్థాయి నాయకులను ఎంపిక చేస్తుండగా, జిల్లా అధ్యక్షుడి ఎన్నిక కోసం సీనియర్ నాయకుల అభిప్రాయం తీసుకుంటున్నారు. జిల్లాలో ప్రధానంగా బెల్లంపల్లి, చెన్నూరు ఎస్సీ నియోజకవర్గాలున్నాయి. మంచిర్యాల జనరల్, ఎస్టీ నియోజకవర్గంగా ఖానాపూర్ పరిధిలోని జన్నారం మండలం ఉంది. ఈ సమీకరణాల నేపథ్యంలో ఎంపిక సాగుతోంది. అయితే కనీసం సగానికి పైగా బూత్ స్థాయి కమిటీలు పూర్తయిన చోట మండల అధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. సగం మండల కమిటీలు పూర్తయితేనే జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకునే అవకాశముంది.

జిల్లా అధ్యక్షుడి ఎంపికపై ఆసక్తి

మండలాధ్యక్షుల ఎంపిక దాదాపు పూర్తవుతున్న నేపథ్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎవరిని ఎన్నుకుంటారనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఈ క్రమంలో ఈసారి అధ్యక్ష పదవి ఓసీలకు కాకుండా బీసీ, ఎస్సీ వర్గాలకు ఇవ్వాలనే డిమాండ్ ఆయా వర్గాల నుంచి అధికంగా వినిపిస్తోంది. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న వెరబెల్లి రఘునాథ్‌రావు మొదటిసారిగా 2019నుంచి 2024వరకు ఆ తర్వాత మరోసారి ఎన్నికయ్యారు. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ముందు నుంచే ఆయనే కొనసాగుతున్నారు. ఈ క్రమంలో పార్టీలో రెండు పర్యాయాలు చేసిన వారికి మళ్లీ ఇవ్వకూడదనే నిబంధన అమలు చేస్తే కొత్తవారికి అవకాశం ఉండనుంది. అలాగే 45ఏళ్ల నుంచి 60ఏళ్ల వయస్సు ఉండాలనే నిబంధన ఉంది. మరోవైపు రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయన ప్రయత్నం చేస్తున్నారు. తనకు టికెట్ వస్తుందనే నమ్మకంతోనే ఎమ్మెల్సీ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ఎమ్మెల్సీగా బరిలోకి దిగితే, జిల్లా అధ్యక్షుడిగా ఇతరులకు అవకాశం ఉంటుందని నాయకులు చెబుతున్నారు. ఇప్పటివరకు ఓసీలకు ప్రాధాన్యం ఇవ్వగా ఈసారి తమకే బాధ్యతలు ఇవ్వాలని బీసీ, ఎస్సీ వర్గాల నేతలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో అధ్యక్ష బరిలో ప్రస్తుతం జనరల్ సెక్రటరీగా ఉన్న రజనీశ్ జైన్‌తో పాటు బీసీల నుంచి వెంకటేశ్వర్‌గౌడ్, తుల ఆంజనేయులు తదితరులతో పాటు ఎస్సీల నుంచి చెన్నూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన దుర్గం అశోక్, బెల్లంపల్లి నుంచి ఏమాజీ, పట్టి వెంకటకృష్ణ తదితరులు పోటీలో ఉన్నారు. మరోవైపు బీజేపీలో ప్రధానంగా సంఘ్, ఆర్ఎస్ఎస్ నేపథ్యమున్నవారు తమకే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఈ క్రమంలో జిల్లాకు కొత్త అధ్యక్షుడు వస్తారా? లేక వెరబెల్లిని మళ్లీ కొనసాగిస్తారా? అనే విషయంలో కోర్ కమిటీ, సీనియర్, నియోజకవర్గ ఇన్‌చార్జీల అభిప్రాయాలు కీలకం కానున్నాయి.

స్వచ్ఛందంగానే భూములిస్తున్నారు



భూములిస్తున్న వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని వేంపల్లి గ్రామంలో ఇండస్ట్రియల్ హబ్ కోసం వేంపల్లి, ముల్కల్లకు చెందిన పలువురు స్వచ్ఛందంగా భూములిస్తున్నారని, ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుతో పారిశ్రామికంగా ఆ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం వేంపల్లి, ముల్కల్లకు చెందిన భూయజమానులతో సమావేశమయ్యారు. స్వచ్ఛందంగా భూములిచ్చేందుకు వచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. భూములిచ్చినవారికి నెలలోపు పరిహారం వచ్చేలా చూస్తానని భరోసానిచ్చారు. ఎకరాకు రూ.14.50 లక్షలు పరిహారంగా ఇవ్వడంతో పాటు దసరా నాటికి అన్ని సౌకర్యాలతో ఇల్లు నిర్మించి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమల ఏర్పాటు అనంతరం భూనిర్వాసితుల కుటుంబాలకు ఉద్యోగావకాశాలను కల్పిస్తామని చెప్పారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎల్లంపల్లి నిర్వాసితులకు ఇప్పటికీ పరిహారం అందలేదనే విషయం అందరికీ తెలిసిందేనని, పారిశ్రామిక రంగం అభివృద్ధి విషయంలో ఎవరు అడ్డుపడినా సహించబోమని హెచ్చరించారు. విపక్షాలు అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. బీజేపీ మతం పేరిట జపం చేస్తోందని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేసి తీరుతానని, మాట తప్పితే రాజీనామా చేసేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. అనంతరం పట్టణంలోని గోదావరినది తీరాన మహాప్రస్థానం నిర్మాణ పనులు పరిశీలించి, పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

భూములు లాక్కుంటే ఊరుకోం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇండస్ట్రియల్ కారిడార్, ఐటీ హబ్ పేరుతో దళిత, నిరుపేదల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. భూములు కోల్పోతున్న బాధితులను మంగళవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హాజీపూర్ మండలంలోని పోచంపాడు, ముల్కల్ల, కొత్తపల్లి, వేంపల్లి గ్రామాల్లో దాదాపు 276 ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్, ఐటీ హబ్ ఏర్పాటుకు ఎలాంటి నోటిఫికేషన్ లేదా జీవో గాని తీసుకురాకుండా అధికారులను తప్పుదోవ పట్టిస్తూ భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో బాధితులను మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌కు తరలించి అనధికారికంగా అధికారులతో సమావేశమై పేదల భూములు లాక్కోవాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. భూముల విలువ ఎకరాకు రూ.కోటి వరకు ఉండగా రూ.13 లక్షల విలువ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. పేదల భూములను దౌర్జన్యంగా తీసుకుంటే బాధితుల పక్షాన పోరాడతామని చెప్పారు. పోలీసులను అడ్డుపెట్టుకుని బెదరింపు రాజకీయాలు చేస్తున్న ఎమ్మెల్యే సీఎం రేవంత్‌రెడ్డిని మించిపోతున్నారని ఆరోపించారు. ఐటీ, ఇండస్ట్రియల్ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, భూసేకరణలో బాధితులకు మార్కెట్ ధర మేరకే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లగచర్ల స్ఫూర్తితో బాధితుల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. అనంతరం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో నిరుపేదలకు భూములు అప్పగిస్తే.. కాంగ్రెస్ ఆ భూములను దౌర్జన్యంగా లాక్కుంటోందని ఆరోపించారు. కాంగ్రెస్ దౌర్జన్యాన్ని అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి
- అభివృద్ధి పనులకు భూమిపూజ



చెన్నూర్‌లో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. స్థానిక పాత మార్కెట్ కార్యాలయ ఆవరణలో రూ.1.30 కోట్లతో చేపట్టిన పీహెచ్‌సీ, తహసీల్దార్ కార్యాలయ సమీపంలో రూ.20 లక్షలతో చేపట్టిన అంబేద్కర్ కమ్యూనిటీ భవన నిర్మాణాలకు ఆయన మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో నేతకాని, ముదిరాజ్ కమ్యూనిటీ హాళ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బెల్లంకొండ కరుణసాగర్‌రావు, తహసీల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కమిషనర్ మురళీకృష్ణ, కాంగ్రెస్ నాయకులు తగరం వెంకటి, బషీరొద్దీన్, సూర్యనారాయణ తదితరులున్నారు.

మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

కోటపల్లి: మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. మండలంలోని నక్కలపల్లి, మల్లంపేట గ్రామాల్లో పలు అభివృద్ధి పనులతోపాటు కోటపల్లిలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. రూ.15లక్షలతో నక్కలపల్లి తోతొర్రె వాగుపై నిర్మించిన లోలెవల్ వంతెనను కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నక్కలపల్లి గ్రామ రోడ్డు నిర్మాణం అటవీ అనుమతులు లేక నిలిచిపోగా త్వరలోనే పనులు ప్రారంభించేలా కలెక్టర్‌తో మాట్లాడి 55 ఎకరాలు కొనుగోలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నక్కలపల్లి రహదారికి త్వరలోనే నిధులు మంజూరు చేసి బీటీ రోడ్డు పనులు ప్రారంభించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, మాజీ సర్పంచులు, అధికారులు, ఏసీపీ వెంకటేశ్వర్, సీఐ సుధాకర్, ఎస్సై రాజేందర్ పాల్గొన్నారు.

'ఉత్పత్తికి మూడునెలలే కీలకం'



అధికారులతో చర్చిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్: వార్షిక ఉత్పత్తి లక్ష్యసాధనకు ఈ మూడు నెలలే కీలకమని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జీ వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్వీ సూర్యనారాయణతో కలిసి శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిని సందర్శించారు. ఈ సందర్భంగా వ్యూ పాయింట్ నుంచి పని స్థలాలను పరిశీలించారు. అనంతరం క్వారీలోకి దిగారు. కోల్‌బెంచీలు, ఆఫ్ లోడింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్పత్తిపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మార్చి 31నాటికి ఆర్థిక సంవత్సరం ముగుస్తుందని, ఈ లోపు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఉత్పత్తి పెంపుదల కోసం పక్కా ప్రణాళికలు రూపొందించి వాటి అమలుకు కృషి చేయాలని చెప్పారు. బొగ్గు ఉత్పత్తితోపాటు రక్షణకూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రోజువారీ ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూనే లోటు ఉత్పత్తినీ పూడ్చుకోవడానికి తగినచర్యలు చేపట్టాలని తెలిపారు. ఓబీ పనులు నిర్వహించే జీవీఆర్, సీఆర్ఆర్ కాంట్రాక్టర్ ప్రతినిధులతోనూ చర్చించి నిర్దేశించిన ఓబీ వెలికితీయాలని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం అనుకున్న లక్ష్యాలు సాధించడానికి అధికారులంతా కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్సార్పీ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి టీ శ్రీనివాస్, ఇందారం ప్రాజెక్ట్ అధికారి ఏవీ రెడ్డి, గని మేనేజర్ బ్రహ్మాజీ, ప్రాజెక్ట్ ఇంజినీర్ నాగరాజు, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

ప్రణాళికతో లక్ష్యాన్ని సాధించాలి

జైపూర్: నిర్దేశిత లక్ష్య సాధనకు తగిన ప్రణాళికతో ముందుకెళ్లాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జీ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఇందారం ఐకే ఓసీపీ ప్రాజెక్ట్‌ను ఆయన శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణతో కలిసి సందర్శించారు. ఓసీపీ ప్రాజెక్ట్‌లో ఉత్పత్తి, నిల్వలను పరిశీలించి లక్ష్యాలపై అధికారులు, సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. మూడునెలల్లో తప్పనిసరిగా నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం అధికారులతో చర్చించారు. క్వారీలోకి వెళ్లి కోల్ బెంచ్‌లు, ఆఫ్ లోడింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఉత్పత్తి పెంపుదలకు తగిన సూచనలు చేశారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని చెప్పారు. వరాహ ఓబీ కాంట్రాక్ట్ కంపెనీ నిర్దేశించిన రోజువారీ లక్ష్యం సాధించడానికి కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఐకే ఓసీపీ ప్రాజెక్ట్ అధికారి ఏవీరెడ్డి, ప్రాజెక్ట్ ఇంజినీర్ రామకృష్ణారావు, సేఫ్టీ అధికారి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కోడి రె'ఢీ'!

- జిల్లాలో జోరుగా కోడిపందేలు
- రహస్య స్థావరాల్లో నిర్వహణ
- గతేడాది 10 కేసులు నమోదు
- ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు



పందెం కోళ్లకు కట్టే కత్తులు (ఫైల్)

మంచిర్యాలక్రైం: ఒకప్పుడు ఆంధ్రకే పరిమితమైన కోడిపందేలు తెలంగాణకు చేరాయి. జిల్లాలో సంక్రాంతి సందర్భంగా ఈ ఏడాది కూడా భారీగా పందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని సరిహద్దు గ్రామాల్లో రహస్య స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. పోలీసులకు దొరకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరోవైపు పందేలను కట్టడి చేసేందుకు పోలీసులూ అప్రమత్తమయ్యారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సంక్రాంతికి మూడు నెలల ముందునుంచే జిల్లాలో ప్రత్యేక నిఘా పెట్టారు. గత అక్టోబర్ 4వ తేదీన కన్నెపల్లి మండలం మాడవెళ్లి పంచాయతీ పరిధి బొత్తుపల్లికి చెందిన బండి మధునయ్య (43) పందెం కోడికి కత్తి కడుతుండగా ప్రమాదవశాత్తు కత్తి కడుపులో దిగడంతో మృతి చెందాడు. ఈ ఘటన జిల్లాలో సంచలనం రేపగా పందేలను కట్టడి చేసేందుకు పోలీసులు మరింత అప్రమత్తయ్యారు.

పట్టుబడ్డ ఘటనలు

- 2023 జనవరి 7న హాజీపూర్ మండలం పెద్దంపేట పంచాయతీ పరిధి కోలంగూడ శివారు అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు కోడిపందేలు ఆడుతున్న 12మందిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి ఏడు కత్తులు, 12 ద్విచక్ర వాహనాలు, 12 సెల్‌ఫోన్లు, రూ. 26,400 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- 2022 ఫిబ్రవరి 5న మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన కొందరు పందెంరాయుళ్లు మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన ప్రాణహిత పరీవాహక అటవీ ప్రాంతంలో రహస్యంగా కోడిపందేలు నిర్వహిస్తుండగా సమాచారం అందుకున్న కోటపల్లి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. 28 మందిని అదుపులోకి తీసుకుని నాలుగు పందెం కోళ్లు, ఐదు కత్తులు, ఏడు వాహనాలు రూ.1.51లక్షల నగదు, 26 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.



పందెం కోడి కత్తి కాటుకు బలైన మధునయ్య మృతదేహం (ఫైల్)

పందేలు నిర్వహించే ప్రాంతాలు

పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా పందెంరాయుళ్లు ఎలాగైనా కోడిపందేలు ఆడేందుకే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పందెం కోళ్లకు శిక్షణ ఇస్తున్నట్లు సమాచారం. జిల్లాలోని ప్రాణహిత సరిహద్దు ప్రాంతాలైన కోటపల్లి, నీల్వాయి, వెంచపెల్లి, ఆల్గాం, రొయ్యలపల్లి, రాంపూర్, కన్నెపల్లి మండలం బొత్తుపల్లి శివారు, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో ప్రత్యేక స్థావరాలను ఎంచుకుని కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. కొందరు ప్రాణహిత సరిహద్దు దాటి మహారాష్ట్రలో కోడిపందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

చూపుడు పందేలే అధికం

కోడిపందేల్లో అనేక రకాలున్నప్పటికీ జిల్లాలో అధికంగా చూపుడు పందేలే ఆడుతుంటారు. బరిలోకి దింపే కోడి పుంజులను ముందే చూపించాల్సి ఉంటుంది. పుంజులకు కత్తులు కట్టించి, కత్తులు లేకుండా సాధారణ పందేలు నిర్వహిస్తుంటారు. పందెంలో సుమారు రూ.వెయ్యి నుంచి రూ.50వేల వరకు బెట్టింగ్ కాస్తుండటం గమనార్హం. పందేల్లో కత్తులు కట్టేవారికి విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఒక్కసారి పుంజుకు కత్తి కట్టినందుకు వారు రూ.వెయ్యి నుంచి రూ.1,500 తీసుకుంటారు. కత్తులను పందెం రాయుళ్లు ముందుగానే చెన్నై నుంచి తెప్పించుకుంటున్నట్లు సమాచారం. అక్కడి నుంచి తెప్పించిన కత్తులు తేలికగా.. చాలా పదునుగా ఉంటాయి.

ప్రత్యేక నిఘా పెట్టాం



హైకోర్టు ఆదేశాల మేరకు కోడిపందేల నిర్వహణపై నిషేధం ఉంది. జిల్లాలో ప్రత్యేక బృందాలతో ప్రత్యేక నిఘా పెట్టాం. ఎవరైనా పందేలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాం. కోడిపందేలు ఆడుతున్నట్లు తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు లేదా 'డయల్ 100' కు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

– ఎం.శ్రీనివాస్, రామగుండం సీపీ

విధుల్లోకి సమగ్ర శిక్షా ఉద్యోగులు



మంచిర్యాల ఎమ్మార్సీలో విధుల్లో సిబ్బంది, పక్కన మండల విద్యాధికారి మాళవీదేవి

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో 28రోజులుగా చేపట్టిన సమ్మెను వీడి సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు మంగళవారం విధుల్లో చేరారు. మొత్తం 424 మంది కేజీబీవీలు, యూఆర్ఎస్‌లో స్పెషలాఫీసర్లు, సీఆర్టీలు, పీజీసీఆర్టీలు, నాన్ టీచింగ్ సిబ్బంది గాను 421 మంది విధులకు హాజరయ్యారు. 18మంది ఎస్వోలు, 63 మంది పీజీ సీఆర్టీలు, 123 మంది సీఆర్టీలు, 199 మంది నాన్‌టీచింగ్ ఉద్యోగులు విధుల్లో చేరారు. విధుల్లో చేరగానే కేజీబీవీల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించారు. ఎస్వోలు విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంక్రాంతి సెలవుల్లో ఇంటికి వెళ్లిన తర్వాత ఏయే సిలబస్ చదవాలో అవగాహన కల్పించారు. దివ్యాంగుల భరోసా నింపే భవిత కేంద్రాలు తెరుచుకున్నాయి. ఎమ్మార్సీ కేంద్రాల్లో ఎంఐఎస్‌సీవోలు రోజువారీ పనుల్లో తలమునకలయ్యారు. 65 మంది పీటీఐల తోపాటు 26మంది ఐఈఆర్పీలు, 43మంది సీఆర్పీలు, 32 మంది ఎంఐఎస్‌సీవోలు విధులకు హాజరయ్యారు. నిన్నటివరకు బోసిపోయిన ఎమ్మార్సీలు, భవిత కేంద్రాలు, కేజీబీవీలు సందడిగా మారాయి.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



తిరుపతి(ఫైల్)

సోన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కె.గోపి తెలిపిన వివరాల ప్రకారం గాంధీనగర్‌కు చెందిన మోరె తిరుపతి (49) సోమవారం మాదాపూర్ గ్రామ సమీపంలోని గోదావరినదిలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగివస్తుండగా సబ్ స్టేషన్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు నిర్మల్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రావణే రవి (37) మృతి చెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ కాలనీకి చెందిన రవి పని నిమిత్తం మంగళవారం ద్విచక్ర వాహనంపై కోడద్ గ్రామానికి వెళ్లి తిరిగివస్తుండగా మార్గమధ్యలో రాంపూర్ సమీపంలో ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీ కొట్టింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని భార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తాపడి మహిళ..

బజార్‌హత్నూర్(బోథ్): ఆటో బోల్తా పడి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అప్పారావ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గిర్నూర్ గ్రామానికి చెందిన మెకెన్ గౌరుబాయి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి దేగామ పోచమ్మ ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో ఆటోలో గిర్నూర్‌కు వస్తుండగా దేగామ సమీపంలో మూలమలుపు వద్ద డ్రైవర్ రాకేష్ వేగంగా నడపడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో లింగంపెల్లి అడెళ్ళ(35) మృతి చెందగా తోషం రాజుబాయి, మైలారపు అరుణ్, అయిల ఆశన్నకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురి రిమాండ్

బెజ్జూర్: వన్యప్రాణులను వేటాడేందుకు అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చిన ముగ్గురిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో మునవీర్ తెలిపారు. మడే ప్రభాకర్, తుమ్మల మహేష్, జక్కం వినోద్ మండలంలోని ఏటిగూడ అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చగా వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

మళ్లీ కలప దందా

- నాలుగేళ్లుగా అజ్ఞాతంలో స్మగ్లర్లు
- ఇటీవల అడవుల నుంచి గుట్టుచప్పుడు కాకుండా తరలింపు
- దాడులతో సవాల్ విసురుతున్న వైనం



ఇచ్చోడ మండలంలోని కేశవపట్నంలో నిల్వ ఉంచిన కలపను స్వాధీనం చేసుకున్న అధికారులు (ఫైల్)



కలప స్మగ్లర్లు బ్రిడ్జిపై నుంచి తోసేసిన అటవీశాఖ అధికారుల వాహనం (ఫైల్)

ఇచ్చోడ(బోథ్): ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ, సిరికొండ కేంద్రాలుగా మళ్లీ కలప దందా షురువైంది. కొన్ని రోజులుగా స్మగ్లర్లు దట్టమైన అటవీప్రాంతంలోని టేకుచెట్లను నరికి రాత్రిపూట స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు. వాటిని సైజులుగా మార్చి ద్విచక్ర వాహనాలపై గ్రామాలు, పట్టణ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

నాలుగేళ్లుగా అజ్ఞాతంలోకి..

జిల్లాలోని అటవీ ప్రాంతాలన్నీ కొన్నేళ్లుగా స్మగ్లర్ల గొడ్డలివేటుకు మైదానాలుగా మారిపోయాయి. దీంతో 2019–20 సంవత్సరంలో అప్పటి సీఎం చంద్రశేఖర్‌రావు కలప దందాపై సీరియస్‌గా తీసుకున్నారు. 'జంగిల్ బచావో...జంగిల్ బడావో' అనే నినాదంతో అడవులను రక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలీసు, అటవీశాఖ సంయుక్తంగా కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపారు. స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపై పీడీయాక్టు కింద కేసు నమోదు చేశారు. దీంతో కలప స్మగ్లింగ్‌కు బ్రేక్ పడింది. నాలుగేళ్లుగా అజ్ఞాతంలో ఉన్న స్మగ్లర్లు ఇటీవల మళ్లీ గుట్టుచప్పుడు కాకుండా దందాను షురూ చేశారు.

దాడులు కొత్తేమీ కాదు..

కలప అక్రమ దందా చేస్తున్న వారంతా నేర ప్రవృత్తి కలిగిన వారే. గతం నుంచీ కూడా వారికి అడ్డువచ్చిన అటవీశాఖ సిబ్బందిపై దాడులు చేయడం వారికి కొత్తేమీ కాదు. గతంలో అటవీశాఖ సిబ్బందిపై దాడులు చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, బోథ్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని సోన్, నిర్మల్, నిజామాబాద్, మహారాష్ట్రలోని పాంఢ్రకొడ, యవత్మాల్ పోలీస్ స్టేషన్లలో వేల కేసులు నమోదయ్యాయి.

ఇటీవల పట్టుబడిన కలప వివరాలు

- డిసెంబర్ 14న సిరికొండ నుంచి ఆదిలాబాద్ వైపు ఆటోలో తరలిస్తున్న రూ.60 వేల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు.
- డిసెంబర్ 17న సిరికొండ మండలంలోని బోరింగ్‌గూడలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2 లక్షల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు.
- డిసెంబర్ 24న ఇచ్చోడ మండలంలోని ఎల్లమ్మగూడ అటవీ ప్రాంతంలో దాచి ఉంచిన రూ.30 వేల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు.
- డిసెంబర్ 30న ఇచ్చోడ మండలం హరినాయక్ తాండ వద్ద ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న రూ.27 వేల విలువైన కలపను పట్టుకున్నారు.
- జనవరి 5న కేశవపట్నంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించి రూ.3.50 లక్షల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు.

అటవీశాఖ అధికారులపై దాడులు కొన్ని...

- 2012లో ఇచ్చోడ మండలంలోని చించోలిలో బ్రిడ్జి వద్ద ఆగిఉన్న అటవీశాఖ వాహనాన్ని బ్రిడ్జిపై నుంచి కిందకు తోసివేశారు.
- 2014లో బజార్‌హత్నూర్ మండలంలోని డేడ్రా అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు టేకు చెట్లను నరుకుతుండగా సిబ్బందితో కలిసి అడ్డుకునేందుకు వెళ్లిన ఇచ్చోడ అటవీశాఖ అధికారిపై రాళ్లతో దాడి చేయగా ఎఫ్ఆర్వో తలకు తీవ్రగాయాలతో బతికి బయటపడ్డాడు.
- 2016లో ఇచ్చోడ మండలంలోని మాన్కపూర్ వద్ద నిర్మాణంలో ఉన్న చెక్‌పోస్టును ధ్వంసం చేశారు.
- 2023లో ఇంద్రవెల్లి నుంచి ఐచర్ వాహనంలో కలప తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు గుడిహత్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద పట్టుకునే ప్రయత్నం చేశారు. ఐచర్ వ్యానుతో అటవీశాఖ సిబ్బందిని ఢీ కొట్టే ప్రయత్నం చేయగా తప్పించుకున్నారు.
- 2024లో సిరికొండలో అక్రమంగా కలప తరలిస్తున్న ఆటోను పట్టుకోగా స్మగ్లర్లు అటవీశాఖ సిబ్బందిపై దాడిచేసి పరారయ్యారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

కలప అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. స్మగ్లింగ్ నివారణకు అన్నికాల చర్యలు తీసుకుంటున్నాం. పెట్రోలింగ్ ముమ్మరం చేశాం. అవసరమైతే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసేందుకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తాం. –ప్రశాంత్ బాజీరావు పాటిల్, డీఎఫ్‌వో, ఆదిలాబాద్

ఆదివాసీ గ్రామాల్లో కులదేవత ఉత్సవాలు



జంగుబాయి ఆలయానికి వెళ్తున్న గిరిజనులు



కానుకలు వేస్తున్న కొలాం ఆదివాసీలు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): పుష్యమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో జంగుబాయి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నెలవంకకు మొక్కిన కొలాం ఆదివాసీలు వారం రోజుల పాటు తమ వంశీయులు ఉన్న గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పెర్సపేన్(పెద్దదేవుడు), జంగుబాయి దేవతలున్న గ్రామాలకు వెళ్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం పాటగూడ కొలాం ఆదివాసీలు (కుమ్ర వంశీయులు) జంగుబాయి దేవత ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సంప్రదాయ వాయిద్యాలతో పుణ్య(గంగా)స్నానం కోసం కెరమెరి మండలంలోని జంగుబాయి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. బుధవారం రాత్రి గ్రామానికి చేరుకుని జంగుబాయికి మహా పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగుబాయి పూజారి కుమ్ర బాపురావ్, గ్రామ పెద్దలు కొడప లక్ష్మణ్, కుమ్ర రాజు, టేకం లేత, కుమ్ర రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

'బాధిత కుటుంబానికి పరిహారం ఇవ్వాలి'



బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న అశోక్

కోటపల్లి(చెన్నూర్): రేసు కుక్కల దాడిలో మృతి చెందిన మేకలకు నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ డిమాండ్ చేశారు. ఇటీవల నక్కలపల్లి అటవీ ప్రాంతంలో ముల్కల్ల వెంకటేశ్‌కు చెందిన 55 మేకలపై రేసు కుక్కలు దాడిచేసి హతమార్చాయి. మంగళవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ కుక్కల దాడిలో 55 మేకలు చనిపోగా 22 అటవీ ప్రాంతంలో గల్లంతయ్యాయన్నారు. రూ.25 లక్షల నష్టం వాటిల్లిందని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించేలా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కృషి చేయాలని కోరారు.

పత్తి బేళ్లు మీదపడి కూలీ మృతి

బోథ్: పత్తి బేళ్లు మీదపడి కూలీ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎల్.ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షిద్ నగర్ కాలనీకి చెందిన గాయక్వాడ్ సంతారామ్ (54) బోథ్ మండల కేంద్రంలోని స్వప్న జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్‌లో రెండు నెలలుగా కూలీ పనులు చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో జిన్నింగ్ ఆవరణలో దీపక్ అనే మరో కూలీతో కలిసి పత్తి బేళ్లను ఒక క్రమంలో పెడుతుండగా ప్రమాదవశాత్తు 1.7 క్వింటాళ్ల బరువున్న పత్తి బేళ్లు సంతారామ్ మీదపడ్డాయి. ముఖం, చాతిపై తీవ్ర గాయాలు కావడంతో స్పృహ కోల్పోయాడు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అందించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని భార్య గాయక్వాడ్ నీలాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సొంతింటి కల నెరవేరే వరకూ పోరాటం



మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

శ్రీరాంపూర్: కార్మికుల సొంతింటి కల నెరవేరేంత వరకు పోరాడుతామని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. మంగళవారం ఎస్సార్పీ3 గనిపై గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లు సంస్థలో పనిచేసిన కార్మికులు కనీసం సొంతింటిని కూడా నిర్మించుకోలేక పోతున్నారన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కనీసం స్ట్రక్చరల్ సమావేశాల్లో వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గొల్ల బాలాజీ, కోశాధికారి చంద్రశేఖర్, మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి, ఆర్జీ 1 అధ్యక్షుడు రాజమౌళి, బ్రాంచ్ నాయకులు బోడకుంట శంకర్, చీకట్ల సాగర్, శ్రీపతి బానేష్, పెరిక సదానందం, మెల్లం శ్రీధర్, నరహరి, వెంకటరెడ్డి, మాదాసి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రిటైర్డు కార్మిక కుటుంబాలు

బెల్లంపల్లి: సింగరేణిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై కుటుంబ సభ్యులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. కన్నాలబస్తీ, టేకులబస్తీ, ఇతర బస్తీలలో నివాసం ఉంటున్న రిటైర్డు కార్మికులు రోడ్డుపై బైటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీ పురోభివృద్ధి కోసం రక్త మాంసాలను ధారపోసిన రిటైర్డు కార్మికులపై సింగరేణి యాజమాన్యం సానుభూతి లేకుండా వ్యవహరిస్తోందన్నారు. చాలీచాలని పింఛన్ డబ్బులతో జీవిత చరమాంకంలో ఎన్నోబాధలను అనుభవిస్తున్నామన్నారు. తమకు కంపెనీ క్వార్టర్ తప్ప మరో ఆధారం లేదన్నారు. ఈ విషయంలో కోల్ బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు అమానుల్లాఖాన్, కాంగ్రెస్ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు ఎండీ గౌస్, మాజీ ఎంపీపీ తొంగల మల్లేశ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు పొట్ల సురేశ్, ఆకుల సత్యనారాయణ, రిటైర్డు కార్మికులు పాల్గొన్నారు.

కరంజీలో పులి సంచారం



పులి జాడ కోసం గాలిస్తున్న అధికారులు



అధికారులు గుర్తించిన పులి పాదముద్ర

- పాదముద్రలు గుర్తించిన అటవీశాఖ అధికారులు
- మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు
- పరిసర గ్రామాల్లో భయాందోళన

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని కరంజి(కే)గ్రామంలో పులి సంచారం భయాందోళనకు గురిచేస్తోంది. పంట చేలకు వెళ్లిన రైతులు పులి పాదముద్రలు గమనించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. మంగళవారం అధికారులు ఆ గ్రామానికి చేరుకుని పాదముద్రలను గుర్తించి పులి కదలికలను నిర్ధారించారు. మహారాష్ట్రలోని పాంఢ్రకవడ డివిజన్ జామిని రేంజ్ నుంచి పెన్‌గంగ దాటి బేల రేంజ్‌లోకి వచ్చిందని, కరంజీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లుగా అనుమానిస్తున్నారు. పెన్‌గంగ పరీవాహక ప్రాంతంలో పోలీసులు, గ్రామస్తులు, అటవీ శాఖ అధికారులు పులి జాడ కోసం అన్వేశించారు. పులిని గుర్తించేందుకు ఒక్కో బృందంలో ఐదుగురు చొప్పున మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి గులాబ్‌సింగ్ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దన్నారు. తప్పుడు పుకార్లు నమ్మవద్దని పాదముద్రలు గానీ, పులి కదలికలు కానీ గమనించినట్లైతే వెంటనే అటవీ శాఖ అధికారులు, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సూర్యాస్తమయం తర్వాత పంటచేలో ఉండవద్దని, ఒంటరిగా చేలకు వెళ్లవద్దని సూచించారు. పంట పొలాల్లోకి వెళ్లేటప్పుడు చప్పుడు చేసుకుంటూ గుంపులుగా వెళ్లాలన్నారు. జైనథ్ సీఐ సాయినాథ్‌తో పాటు ఏఎస్ఐ ఆత్మారాం, అటవీ శాఖ అధికారులు, ఉద్యోగులు నాగోరావు, రాజేందర్, ఆర్.గులాబ్‌సింగ్, మనోరంజనీ, ప్రవీణ్, సంతోష్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పట్టుకున్న వాహనం ఇచ్చేశారు..

మందమర్రిరూరల్: నాలుగు రోజుల క్రితం సింగరేణి స్క్రాప్ చోరీ చేసి సెక్యూరిటీ సిబ్బంది వెంబడించడంతో దొంగలు స్కూటీని వదిలి వెళ్లారు. స్కూటీని, స్క్రాప్‌ను స్వాధీనం చేసుకుని ఏరియాలోని ఎస్అండ్‌పీసీ కార్యాలయానికి తరలించారు. ఏం జరిగిందో తెలియదు కానీ మూడు రోజుల తర్వాత స్కూటీని సంబంధిత వ్యక్తికి ఇచ్చినట్లు సమాచారం. ఈ విషయమై ఏఎస్‌వోను వివరణ కోరగా చోరీకి వచ్చిన వ్యక్తి మరొకరి స్కూటీని తెచ్చాడని, స్కూటీకి సంబంధించిన వ్యక్తి కార్యాలయానికి వచ్చి కోరగా ఉన్నతాధికారులకు విషయం చెప్పి స్కూటీని ఇచ్చేశామన్నారు.

కలప పట్టివేత



గుండాలలో పట్టుకున్న కలప

ఇచ్చోడ: మండలంలోని గుండాలలో మంగళవారం దాచి ఉంచిన కలపను పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు గుండాలలో తనిఖీలు నిర్వహించగా రంజాన్ అనే వ్యక్తి ఇంట్లో దాచి ఉంచిన కలపను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కలప విలువ రూ.6,400 ఉంటుందన్నారు.

జన్నారం: ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న కలపను మాటు వేసి పట్టుకున్నట్లు ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. నాలుగు రోజులుగా కలప తరలించడానికి యత్నిస్తున్నారనే సమాచారం మేరకు రేంజ్ అధికారి సిబ్బందితో కలిసి అటవీ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సోమవారం రాత్రి ముచ్చినేని రాజు టేకు దుంగను బైక్‌కు కట్టుకుని వస్తుండగా పట్టుకున్నారు. బైక్‌తో పాటు కలప దుంగను సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించామని తెలిపారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు లాకవత్ ఉపేందర్, లాకవత్ రాజు, గవ్వల మురళి, రాజుపై కేసు నమోదు చేసినట్లు రేంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. పట్టుకున్న కలప విలువ రూ. 29,134 ఉంటుందన్నారు.

జాతీయస్థాయి శిక్షణకు ఎంపిక

భైంసాటౌన్: జాతీయ విద్యావిధానంపై ఢిల్లీలో జరిగే శిక్షణకు భైంసా పట్టణానికి చెందిన హిందీ ఉపాధ్యాయుడు నవీన్‌కుమార్ ఎంపికయ్యారు. లోకేశ్వరం మండలం మన్మద్ జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న నవీన్‌కుమార్ ఈనెల 8 నుంచి 28 వరకు జరిగే శిక్షణకు హాజరుకానున్నారు. ఈ మేరకు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి పదిమందిని ఎంపిక చేయగా జిల్లా నుంచి నవీన్‌కుమార్ ఉన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా



సమ్మయ్యను అభినందిస్తున్న ఏసీపీలు

బెల్లంపల్లి: హైదరాబాద్ కేంద్రంగా ఈ నెల 4 నుంచి 6 వరకు జరిగిన తెలంగాణ స్టేట్ 11వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో బెల్లంపల్లికి చెందిన హెడ్ కానిస్టేబుల్ పూదరి సమ్మయ్య సత్తా చాటాడు. 50 సంవత్సరాల విభాగంలో జరిగిన హైమర్‌త్రో పోటీల్లో ప్రథమ బహుమతి, డిస్కస్‌త్రో పోటీల్లో తృతీయ బహుమతి గెలుచుకున్నాడు. మంగళవారం రామగుండం పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అడ్మిన్ ఏసీపీ రాజు, ఏఆర్ ఏసీపీ సుందరరావు, కమిషనరేట్ ఎంటీవో సంపత్‌కుమార్ అభినందించి రివార్డు అందజేశారు.

వన్యప్రాణుల వేటగాళ్ల పట్టివేత



వేటగాళ్లతో అటవీశాఖ అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలోని అటవీ శివారు ప్రాంతాల్లో వన్యప్రాణులను వేటాడే ముఠాను మంగళవారం పట్టుకున్నట్లు లక్సెట్టిపేట అటవీరేంజ్ అధికారి అత్తె సుభాష్ తెలిపారు. టీకానపల్లికి చెందిన జాడి రాజలింగు, ఇరగడ్డ సాగర్, బుద్ధిపల్లికి చెందిన జాడి వినోద్, దుర్గం ప్రశాంత్, దుర్గం రాములు జాడి రాజలింగుకు చెందిన పత్తి చేనులో ఉన్న విద్యుత్ లైన్ ద్వారా సమీప అటవీ ప్రాంతంలో సంచరించే వన్యప్రాణులను వేటాడేందుకు రెండు కిలోమీటర్ల వరకు బైండింగ్ వైర్ వేశారు. ఈ నెల 3న అటవీ అధికారులు గమనించి ఐదుగురిని అదుపులోకి తీసుకుని లక్సెట్టిపేట అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు. విచారణలో నేరం అంగీకరించడంతో వైల్డ్‌లైఫ్ సంరక్షణ చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కానీ మూడు రోజుల క్రితం వేటగాళ్లను అదుపులోకి తీసుకున్న అధికారులు బేరసారాలు సాగిస్తున్నారని ముమ్మర ప్రచారం జరగడంతో అప్రమత్తమై ఎట్టకేలకూ అరెస్టును అధికారికంగా ప్రకటించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చైనా మాంజా వినియోగిస్తే చర్యలు తప్పవు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్ నాయక్

కాసిపేట(బెల్లంపల్లి): చైనామాంజాతో గాలిపటాలు ఎగురవేస్తే చర్యలు తప్పవని అటవీశాఖ డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ నాయక్ అన్నారు. మంగళవారం తెలంగాణ మోడల్ స్కూల్, ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చైనా మాంజాతో గాలిపటాలు ఎగురవేయడం వల్ల జరిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇది ప్లాస్టిక్ పదార్థంతో చేయడంతో గట్టిగా పదునుగా ఉంటుందని, ఆ దారానికి గాజుపొడి పూయడంతో పిల్లలు, మనుషులు, పక్షులు, అటవీ జంతువులను కోసుకుపోవడం వలన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర పర్యవరణ చట్టం 2016 ఉత్తర్వుల ప్రకారం చైనా మాంజాను నిషేధించినట్లు తెలిపారు. మాంజాను రవాణా చేసినా నిల్వ ఉంచినా గాలిపటాలు ఎగురవేసినా మూడు నుంచి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో శ్రీధర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నాగమల్లయ్య, పుష్పలత, బండ శాంకరి, జ్యోతి, తిరుపతి, చెంద్రశేఖర్‌రెడ్డి, మాధవిలత, కృష్ణగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ గద్దె రాజు

రామకష్టాపూర్(చెన్నూర్): పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఈ నెల 9 నుంచి తెలంగాణ స్థాయి(సౌత్‌జోన్)అండర్–13 బాలికల ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నాయి. ఖేలో ఇండియా పోటీలలో భాగంగా ఐదు రోజులపాటు లీగ్ పద్ధతిలో నిర్వహించనున్న ఈ పోటీల్లో మొత్తం ఏడు జిల్లాల జట్లు పాల్గొననున్నట్లు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పోటీల నిర్వహణకు సింగరేణి యాజమాన్యంతో పాటు క్యాతనపల్లి మున్సిపాలిటీ పాలకవర్గం సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఏర్పాట్లను మంగళవారం మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, ఏఈ అచ్యుత్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రాజు పరిశీలించారు.

పురుగుల మందుతాగి ఒకరు బలవన్మరణం

బెజ్జూర్: పురుగుల మందు తాగి ఒకరు బలవన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని అందుగులగూడకు చెందిన కోరేత ప్రకాశ్ (32)కు గబ్బాయి గ్రామానికి చెందిన లలితతో పదమూడేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి గబ్బాయిలోనే నివాసం ఉంటున్నాడు. దంపతులకు తొమ్మిదేళ్ల కూతురు ఉంది. భార్య ప్రవర్తన మార్చుకోవాలని పలుమార్లు చెప్పినా వినకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం సాయంత్రం ఇంటివద్ద పెరట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా 108లో బెజ్జూర్ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. కాగా ప్రకాశ్ మృతికి అతని భార్య కారణమని కుటుంబ సభ్యులు ఇచ్చి ఫిర్యాదు మేరకు లలితపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

ల్యాండ్రీ షాపు దగ్ధం

ఆదిలాబాద్‌రూరల్: పట్టణంలోని మావల పోలీస్ స్టేషన్ పరిధిలో గల దస్నాపూర్ కాలనీలో ల్యాండ్రీ షాప్ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితుడు సాంటెన్న తెలిపిన వివరాల మేరకు సోమవారం రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి 10.30 గంటల సమయంలో షాపులో మంటలు చెలరేగాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లగా అప్పటికే అగ్నిమాపక అధికారులు మంటలను అదుపు చేశారన్నారు. ప్రమాదంలో షాపులో ఉన్న ఫ్యాన్, టేబుల్, కుర్చీలు, బట్టలు దగ్ధమయ్యాయని, వాటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. బాధితుడిని ఆర్థికంగా ఆదుకోవాలని సామాజిక వేత్త ముడుపు మౌనిష్ రెడ్డి కోరారు.